TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990

సంపుటి : 01 సంచిక : 296 | గురువారం జూలై 03 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం




- హెల్త్ టూరిజం హబ్‌గా హైదరాబాద్ అభివృద్ధి
- కార్పోరేట్ ఆస్పత్రులతో పోటీగా ప్రభుత్వాసుపత్రులు
- బంజరాహిల్స్‌లో ఎఐజి ఆస్పత్రిని ప్రారంభించిన సిఎం
- నాగేశ్వర్ వైద్య సేవలను అభినందించిన రేవంత్

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు .ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. గరంలోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. 66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు. 2లో..

## దేశానికి మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్



2లో..

- తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పునర్వ్యవస్థీకరణ
- దీపరివాహక ప్రాంత నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు
- రెవెన్యూ,సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి

## పట్టణ కూలీలకు 'ఆత్మీయ భరోసా' ఎందుకు వర్తింపజేయట్లేదు?: హైకోర్టు



2లో..

## బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

17న రైలురోకో చేసి తీరుతాం
ఖమ్మంలో పోస్టర్ ఆవిష్కరించిన కవిత



2లో..

## నార్సింగి పీఎస్ పరిధిలో హెరాయిన్ స్వాధీనం




హైదరాబాద్: నగర శివారు నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో హెరాయిన్‌ను ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ. 1.10కోట్ల విలువైన 650 గ్రాముల హెరాయిన్‌ను పట్టుకున్నారు. రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన రాజారాం ఈ హెరాయిన్‌ను విక్రయిస్తున్నట్లు నిర్ధరించారు. ఒకరిని అదుపులోకి తీసుకుని నార్సింగి పోలీసులకు ఎస్‌వోటీ పోలీసులు అప్పగించారు.




# చేనేత కార్మికుల రుణమాఫీకి 33 కోట్లు

5691 మంది చేనేత కార్మికులకు లబ్ది
పరిపాలన అనుమతులు జారీచేసినట్లు మంత్రి తుమ్మల వెల్లడి

## రాష్ట్రానికి తగిన యూరియా కేటాయించండి

కేంద్రానికి లేఖ రాసిన మంత్రి తుమ్మల

2లో..



ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు, చేనేత కార్మికులకు లక్ష వరకు రుణమాఫీ కోసం రూ. 33 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. దీంతో 5,691 మంది చేనేత కార్మికులకు లబ్ది చేకూరుతుందని ఆయన అన్నారు. ఇంతకుముందు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 2017 ఏప్రిల్ 1వ తేది నుండి 2024 మార్చి 31 వరకు అన్ని బ్యాంకులు మరియు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో చేనేత వస్త్రాల ఉత్పత్తి, వృత్తి సంబంధిత కార్యకలాపాల కోసం తీసుకొన్న రూ. లక్ష వరకు రుణాల (అసలు, వడ్డీ కలిపి)కే మాఫీ వర్తిస్తుందని మంత్రి తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాల వారిగా లబ్దిదారుల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగు తుందని, 2లో..

# సంపాదకీయం

## ఎమర్జెన్సీతో తలపడిన ఒక తరం యువ కార్యకర్తలు

శ్రీమతీ ఇందిరా గాంధీ 1975లో ప్రకటించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్య పరిరక్షణకు కీలకమైన పోరాట సందర్భంగా, రాజ్యాంగ హక్కుల బోలుతనాన్ని వెల్లడించేదిగా, నిరంకుశ అధికారం తలెత్తడానికి దారితీసిన పరిస్థితిగా ముందుకు వచ్చింది. ఎమర్జెన్సీ ప్రకటనను, దేశ ప్రజానీకం మీద నిరంకుశ పరిపాలన శాశ్వతంగా రుద్దడానికి చేపట్టిన దుర్మార్గపు చర్యగా సి.పి.ఐ (యం) నాయకత్వం తొలుత భావించింది. సుదీర్ఘ కాలంపాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పాతర వేసే అవకాశం ఉన్నదని అంచనా వ్యక్తం చేసింది. అయితే కొద్ది వారాలలోనే ఇది ప్రతిపక్ష రాజకీయ పక్షాలను చెదరగొట్టడానికి శ్రీమతి గాంధీ చేపట్టిన తెలివిమాలిన చర్యగా స్పష్టమయ్యింది.

1971లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో 'గరీబీ హటావో' నినాదంతో శ్రీమతి గాంధీ అధికారాన్ని గెలుచుకున్నారు. అయితే ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన అనేక వాగ్దానాలను శ్రీమతి గాంధీ ప్రభుత్వం నెరవేర్చని ఫలితంగా ప్రజలలో పెద్ద ఎత్తున అసంతృప్తి గూడుకట్టుకున్నది. 1974లో రైల్వే కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె, బీహార్‌లో జయప్రకాష్ నారాయణ మొదలు పెట్టిన 'సంపూర్ణ విప్లవం' ఉద్యమం–ఈ రెండూ నాడు ప్రజలలో నెలకొన్న అసంతృప్తికి తార్కాణాలు. శ్రీమతి ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లనేరదని అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఈ అసాధారణమైన అప్రజాస్వామిక చర్యకు శ్రీమతి గాంధీ పూనుకున్నారు. చిల్లర రాజకీయ ప్రయోజనం కోసం చేపట్టిన ఈ చర్యను ప్రజాస్వామిక పరిరక్షణ కోసం ప్రజానీకాన్ని పెద్ద ఎత్తున కదిలించడం ద్వారా వమ్ము చెయ్యవచ్చు.

దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించే నాటికి నేను భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) జాతీయ కార్యదర్శిగా, సిపిఐ(యం) కార్యకర్తగా పని చేస్తూ జవహర్‌లాల్ నెహ్రూ యునివర్సిటీ (జె.ఎన్.యు)లో డాక్టరేట్ పరిశోధక విద్యార్థిగా ఉన్నాను. అప్పటికి ఎస్ఎఫ్ఐ స్థాపించి (1970) ఐదేళ్లు అయింది. కానీ విద్యార్థుల హక్కుల పరిరక్షణలో, ఇందిరా గాంధీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించడంలో సమరశీల సంఘంగా పేరు తెచ్చుకున్నది. ఈ కారణంగానే ఎమర్జెన్సీలో ఎస్ఎఫ్ఐ మీద దాడులు జరిగాయి. ఎస్ఎఫ్ఐకి చెందిన తొమ్మిది మంది కీలక ఆఫీస్ బేరర్లను, నాయకులను అరెస్టు చేసి అంతర్గత భద్రతా చట్టం (మీసా) కింద జైల్లో కుక్కారు. తదనంతరం మరో 60 మందిని మీసా చట్టం కింద జైలు పాల్జేశారు. దేశవ్యాప్తంగా వందల మంది విద్యార్థి నాయకులను, క్రియాశీల కార్యకర్తలను మరో నిర్బంధ చట్టం డిఐఆర్ కింద అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఈ నేపథ్యంలో అరెస్టుకి చిక్కకుండా అజ్ఞాతంలో ఉండి పని చేయమని పార్టీ నన్ను ఆదేశించింది. విద్యార్థి సంఘం జాతీయ స్థాయిలో కనీస కార్యకలపాలు నిర్వహించేలా చూడమని నాకు బాధ్యత అప్పచెప్పింది.

ఢిల్లీలో అధికారగణం జె.ఎన్.యు విద్యార్థుల మీద, విద్యార్థి సంఘం మీదా దాడులు ముమ్మరం చేసింది. జులై 7వ తేదీన వందలాది మంది పోలీసుల విశ్వవిద్యాలయ హాస్టళ్లను చుట్టముట్టి ఇంటరాగేషన్ పేరిట అనేక మందిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అందులో పది మందిని అదుపులోకి తీసుకుని మిగిలిన వారిని విడిచిపెట్టారు. ఎస్.ఎఫ్.ఐ నాయకత్వంలో జె.ఎన్.యు విద్యార్థులు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రతిఘటనోద్యమాన్ని నిర్వహించసాగారు. పోలీసులు విద్యార్థి సంఘం అధ్యక్షుడు డి.పి. త్రిపాఠీని అరెస్టు చేయ్యడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. కర్కోటక పోలీసుగా పేరొందిన డి.ఐ.జి పి.యస్ భిందర్ పోలీసు యూనిఫారం లేకుండా హాస్టల్లోకి ప్రవేశించి ఎస్.ఎఫ్.ఐ కార్యకర్త ఒకరిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. అయితే డి.పి త్రిపాఠీ అనుకుని ప్రబీర్ పుర్కాయస్థను ఎత్తుకెళ్లారు. జరిగిన పొరపాటును సరిదిద్దుకోవడానికి బదులుగా పోలీసులు ప్రబీర్ మీద అక్రమ అభియోగాలు మోపి మీసా కింద అరెస్టు చేసి ఎమర్జెన్సీ ముగిసేంతవరకూ జైల్లో పెట్టారు. విశ్వవిద్యాలయ అధికారులు విద్యార్థి నాయకుడిని బహిష్కరించిన నేపథ్యంలో జె.ఎన్.యు విద్యార్థులు మూడు రోజుల పాటు సమ్మె చేశారు.

వివిధ భావజాలాలతో పలు విద్యార్థి సంఘాలలో పని చేస్తున్న విద్యార్థులందరూ దేశవ్యాప్తంగా ఐక్యమై నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అజ్ఞాత జీవితం గడుపుతున్నప్పటికీ నేను విద్యార్థి సంఘం కార్యకలాపాలు నడిచేలా చూడడానికి వివిధ రాష్ట్రాలు తిరిగాను. కొన్ని చోట్ల అజ్ఞాత సమావేశాలు నిర్వహించాను. నాడు తమిళనాడు ముఖ్యమంత్రిగా డి.ఎం.కె పార్టీకి చెందిన కరుణానిధి ఉండడం, ఆయన ఎమర్జెన్సీని బహిరంగంగానే వ్యతిరేకించడంతో ఎమర్జెన్సీ వ్యతిరేక శక్తులు సమావేశాలు నిర్వహించుకోవడానికి చెన్నై సురక్షిత స్థావరంగా మారింది. ఇది పసిగట్టిన ఇందిర ప్రభుత్వం 1976 జనవరిలో కరుణానిధి ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చెయ్యడంతో ఆ గూడు కాస్తా చెదిరిపోయింది.

21 నెలల్లో ఎమర్జెన్సీ ముగిసిపోయింది. ఈ కాలంలో నా వ్యక్తిగత జీవితం కూడా అనేక మలుపులు తిరిగింది. సిపిఐ(యం)లో పనిచేస్తున్న తోటి కార్యకర్త బృందాతో నా వివాహం జరిగింది. మేం ఇద్దరం పాక్షికంగా అజ్ఞాత జీవితం గడుపుతున్నందున మా వివాహం ఒక కామ్రేడ్ నివాసంలో గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయింది. బృందా 'రీటా' అనే మారు పేరుతో, నేను 'సుధీర్' అనే మారు పేరుతో అజ్ఞాత జీవితం గడిపాం. జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటుండగా%ొ%నన్ను పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు నేర్పించిన మా అమ్మ కూడా ఈ కాలంలోనే మరణించి నాకు తీరని విషాదాన్ని మిగిల్చింది. నేను అజ్ఞాత జీవితం గడుపుతున్న మూలాన కొద్దికాలం అమ్మకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే బృందాతో వివాహమయ్యాక అమ్మను తీసుకొచ్చి మాతోనే ఒక చిన్న అవుట్‌హౌస్‌లో అట్టేపెట్టుకున్నాం. నాలుగు నెలలు తిరగకుండానే 54 ఏళ్ల వయసులో అమ్మ చనిపోయింది.

ఒక తరం పార్టీ కార్యకర్తలకు అప్పుడే మొదలైన ఉద్యమ జీవితంలో ఎమర్జెన్సీ అనేక అనుభవాలను మిగిల్చింది. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక హక్కులలో బోలుతనం ఏమిటో అర్థమయ్యేలా చేసింది. ప్రజాస్వామ్య హక్కుల పట్ల బేఫర్వాగా ఉండకూడదని తెలియజెప్పింది. అలాగే ప్రజల మధ్య ఉండి పనిచేయడం, ముఖ్యంగా విద్యార్థులతో కలిసి పని చెయ్యడం ద్వారా శ్రమకోర్చి సాధించుకున్న హక్కులను చేజారనీకుండా పరిరక్షించుకునేది అంతిమంగా ఆ ప్రజలే అన్న సత్యం బోధపడింది.

ఎమర్జెన్సీ కాలంలో చురుగ్గా పని చేసి తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొన్న ఎస్.ఎఫ్.ఐ నాయకులు, కార్యకర్తలు తదనంతర కాలంలో సిపిఐ(యం) అగ్ర నాయకులుగా ఎదిగారు. మాణిక్ సర్కార్, కొడియేరి బాలకృష్ణన్, సీతారాం ఏచూరి, యం.ఎ.బేబి వంటి వారు ఈ కోవకు చెందినవారే. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థి, యువజన ఉద్యమాలకు నాయకత్వం వహించిన అనేక మంది వారి, వారి రాష్ట్రాలలో వివిధ రాజకీయ పార్టీలలో అగ్ర నాయకులుగా ఎదిగారు.

యాభై ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే మన దేశ ప్రజాస్వామిక వ్యవస్థ మీద తొలిసారిగా జరిగిన దాడిగా 'ఎమర్జెన్సీ' అందరి మదిలో నిలిచిపోతుంది. అయితే ఇది హఠాత్ పరిణామంగా భావించరాదు. 1950ల నుంచే ప్రజల ప్రజాస్వామిక హక్కుల మీద, పౌరహక్కుల మీద క్రమేణా పెరుగుతూ వచ్చిన దాడులకు కొనసాగింపుగా జరిగిన పెను దాడిగా మనం గుర్తించాలి.అలాగే ఇవాళ దేశంలో నెలకొన్న పరిస్థితులను ఎమర్జెన్సీ కాలంతో సాపత్యం పెట్టి చూడడం కూడా పొరబాటు. గత పదకొండేళ్లుగా మోడీ హయాంలో సాగుతున్న పాలనను 'అప్రకటిత ఎమర్జెన్సీ'గా పేర్కొనడం కూడా సరైన అవగాహన కాజాలదు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం మీద, రాజ్యాంగ సూత్రాల మీద జరుగుతున్నది సంస్థాగతంగా నిరంకుశత్వాన్ని నెలకొల్పుతున్న దొంగ దాడి. ఇవాళ దేశం యావత్తు చవిచూస్తున్న అపరిమిత నిరంకుశ పోకడలతో పోల్చి చూస్తే ఎమర్జెన్సీ తేలిపోతుంది.

# దేశానికి మోడల్‌గా

## తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్

మొదటి పేజీ తరువాయి

ప్రకృతి వైపరీత్యాలను సమర్ధవంతంగా ఎదుర్కొని వీలైనంత వరకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ఉండేలా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్ అథారిటీని బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేశానికి ఒక మోడల్‌గా ఉండేలా వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్థ ను పునర్వ్యస్థీకరించినట్లు వెల్లడించారు. ఈ సంస్థకు గౌరవ ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా ఉంటారని ఇందులో రెవెన్యూ, హోమ్, ఆర్థిక, వైద్య ఆరోగ్యం, భారీ నీటిపారుదల, రహదారులు భవనాలు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు సభ్యులుగానూ, చీఫ్ సెక్రటరీ మెంబర్ కన్వీనర్‌గాను, రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రత్యేక ఆహ్వానితునిగా ఉంటారని తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గోదావరి మరియు కృష్ణా నదీ పరివాహక జిల్లాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లు , ఇతర ఉన్నతాధికారులతో చీఫ్ సెక్‌లటరీ కె. రామకృష్ణారావు, విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ 'వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా వచ్చే వరదలు, వర్షాల సమాచారాన్ని ఐఎండీతో సమన్వయం చేసుకొని శాస్త్రీయంగా విశ్లేషించుకొని ఎప్పటికప్పుడు పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందించేలా వ్యవస్థను రూపొందించుకోవాలి. సమాచార వ్యవస్థ మరింత బలోపేతం కావాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో వర్షాలు, వరదలకు సంబంధం ఉన్న ఇరిగేషన్, విద్యుత్, హెల్త్, వ్యవసాయం, పోలీస్, రవాణా తదితర విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలను మనం అడ్డుకోలేం కానీ వాటి ప్రభావాన్ని తగ్గించడానికి ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే నష్టాన్ని వీలైనంతవరకు తగ్గించగలుగుతాం. ప్రధానంగా కృష్ణా గోదావరి పరీవాహక ప్రాంతాల అధికార యంత్రాంగం వరద ముంపును ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. దీనివలన మనం నష్టాన్ని తగ్గించినవారమవుతాం అన్నారు.నదీపరివాహక ప్రాంతాల్లో ఏ మేరకు వరద ఉధృతి వస్తే ఏఏ గ్రామాలు ముంపునకు గురౌతాయోనన్న సమాచారాన్ని నీటిపారుదల శాఖ ముందుగానే అందించాలి. ఇతర రాష్ట్రాలలో వచ్చే వరద వివరాలు, స్థానికంగా పడిన వర్షం వివరాలు, ఎంత నీటిని విడుదల చే?స్తారనే విషయాలు సవివరంగా ఉండాలి. నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాసితులను వరదలు వచ్చిన ప్రతిసారీ సురక్షిత ప్రాంతాలకు తరలించడం కంటే వారికి శాశ్వత నివాసం కల్పించాలి. ఇందుకు సంబంధించి నివాసితుల వివరాలను గుర్తిస్తే అదనపు కోటా కింద ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్ లిఫ్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసుకోవాలి. ఈ ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల గత ఏడాది నా నియోజకవర్గం పాలేరులో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయానని ఈ సందర్భంగా మంత్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్ లిఫ్ట్ మెకానిజం ఏవిధంగా ఉండాలి, విపత్తు సంభవించిన ప్రాంతానికి ఏవిధంగా చేరుకోవాలి వంటి అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, సెక్రటరీ శివశంకర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమిషనర్ సృజన, సిపి డిసిఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి. గోపి. ఐఎండీ అధికారిణి నాగరత్నం. సివిల్ సప్లయిస్ డైరెక్టర్ ముజముల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆమోదం పొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు జులై 17వ తేదీన రైలు రోకో కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. ఈ రైలు రోకోలో అత్యధిక సంఖ్యలో పాల్గొని.. బీసీ రిజర్వేషన్లు ఉద్యమానికి మద్దతు తెలపాలంటూ ఖమ్మం జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొనాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుదే బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకోకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు నిచ్చింది. అందులోభాగంగా ఇటీవల అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు.

ఖమ్మం జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా అని గుర్తు చేశారు. అయితే వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించండి.. అంతేకానీ బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసుల గురించి కాదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు కవిత చురకలంటించారు. పోలవరం – బనకచర్ల నీటి విషయంలో ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు మాట్లాడాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఇస్తామని అనేక సభలలో ఆ పార్టీ నేతలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణం బీఆర్ఎస్ పార్టీతోపాటు ఖమ్మం జిల్లాకు తీరని లోటన్నారు. మదన్ లాల్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు. మదన్‌లాల్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కవిత భరోసా ఇచ్చారు.

## పట్టణ కూలీలకు 'ఆత్మీయ భరోసా' ఎందుకు వర్తింపజేయట్లేదు?: హైకోర్టు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: రాష్ట్రంలోని పట్టణ కూలీలకు 'ఆత్మీయ భరోసా' ఎందుకు వర్తింపజేయట్లేదని ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక కార్యదర్శికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 29కి హైకోర్టు వాయిదా వేసింది.

పట్టణ కూలీలకు ఆత్మీయ భరోసా అమలు చేయాలని గతంలో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఆదేశాలను అమలు చేయడం లేదంటూ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. నారాయణపేటకు చెందిన శ్రీనివాస్ ఈ పిటిషన్ వేయగా.. ఆయన తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు.

# తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం



మొదటి పేజీ తరువాయి

ఇకపోతే గోశామహల్ లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తయితే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని.. రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# చేనేత కార్మికుల రుణమాఫీకి 33 కోట్లు

మొదటి పేజీ తరువాయి

వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే కార్మికుల ఖాతాలలో రుణమాఫిని జమ చేయడం జరుగుతుందని అన్నారు. రుణ మాఫీ జరిగిన అనంతరం చేనేత కార్మికులు కోరుకుంటే బ్యాంకర్లు మళ్లీ ఆ మేరకు రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయని మంత్రిగారు పేర్కొన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి చేనేత కార్మికుల సంక్షేమం కోసం దాదాపు 920 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడు పనికల్పించాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు ÷ఉఅక్ష నుండే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు, అందుకు అనుగుణంగా ఇప్పటికే 579 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి ఆర&ధర్లు వచ్చాయని అన్నారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా సిరిసిల్లలోని 16 వేల మరమగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. 193 కోట్లు చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వం కార్మికులకు చెల్లించకుండా వదిలేసిన 290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాలలో జమ చేశామన్నారు. మా ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా మరోసారి తెలియజేశారు.

# రాష్ట్రానికి తగిన యూరియా కేటాయించండి

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రానికి సరిపడేంత యూరియాను కేటాయించాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్‌నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు మంత్రి లేఖలు రాశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రాష్ట్రంలో యూరియా అవసరం అంతకంతకు పెరిగిపోయిందని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల కోటాను కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిందని.. అందులో ఇప్పటి వరకు 3.06 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని చెప్పారు.అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపు 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తాజాగా జులై నెలకు నిర్దేశిరచిన సప్లై ప్లాన్ ప్రకారం రాష్ట్రానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. కానీ అందులో 60 శాతం ఇంపో÷–టగ్గ÷డ్? యూరియాను కేటాయించటం ఆందోళన కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు. దిగుమతుల ద్వారా రాష్ట్రానికి రావాల్సిన యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే పరిస్థితి లేదని, ఇప్పటి వరకు ఆ యూరియాను రవాణా చేసేందుకు అవసరమైన నౌకల కేటాయింపు జరగలేదని లెటర్‌లో ప్రస్తావించారు. దీంతో ఖరీఫ్‌పంటలకు అనువైన సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోందని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. యూరియా సరఫరాపై కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జులై నెలకు కేటాయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్ యూరియాకు నౌకలను కేటాయించాలని కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని వినతి చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు తలెత్తిన యూరియా లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖలో కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలి

**- ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష**

**- సీజనల్ వ్యాధుల నియంత్రణ, వనమహోత్సవం, ఎల్ఆర్ఎస్ అనుమతులపై అధికారులకు దిశా నిర్దేశం**

**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**





నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 02

పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పురోగతి సాధించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన ఆర్మూర్ మున్సిపాలిటీని సందర్శించి, పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం,సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు చర్యలు,ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారులకు అనుమతుల మంజూరు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఒక్కో వార్డు వారీగా ఆయా అంశాలలో ప్రగతిని సమీక్షించిన కలెక్టర్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 617 మందికి ఇళ్లను మంజూరు చేయగా, కేవలం 183 మాత్రమే గ్రౌండింగ్ జరిగాయని అధికారులు, వార్డు ఆఫీసర్ల పనితీరును ఆక్షేపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని ఎలా సాధిస్తారని నిలదీశారు. అలసత్వ వైఖరిని వీడాలని, ఇకనైనా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. అవసరమైతే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని అన్నారు. ఇల్లు మంజూరు అయిన ప్రతి ఒక్కరూ నిర్మాణం చేపట్టేలా అవసరమైన తోడ్పాటును అందించాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఆర్థిక స్థోమత లేని లబ్దిదారులకు మెప్మా ఆధ్వర్యంలో రుణాలు ఇప్పించేలా చొరవ చూపాలని అన్నారు. ఒకవేళ ఎవరైనా మహిళా సంఘాలలో సభ్యులుగా లేనట్లయితే, వారిని సభ్యులుగా చేర్పించి రుణాలు మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు. ఇప్పటికే సభ్యులుగా ఉన్న వారికి మూడు రోజులలో, కొత్తగా సభ్యత్వం కల్పించే వారికి వారం వ్యవధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లక్ష రూపాయల వరకు రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. తాను వచ్చే వారం మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించాలని అన్నారు. తీసుకున్న రుణాన్ని ఇంటి నిర్మాణానికి వెచ్చించేలా నిశిత పర్యవేక్షణ జరపాలని సూచించారు.

కాగా, పచ్చదనాన్ని పెంపొందిస్తూ, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వీలుగా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలని, వాటిని నాటి పరిరక్షించేలా అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించే విధంగా పకడ్బందీ చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. గత సీజన్ లో నాటిన మొక్కల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలను ఆయా కేటగిరీలుగా విభజిస్తూ, పూలు, పండ్ల మొక్కలను నివాస గృహాల కోసం పంపిణీ చేయాలని, మూడు మీటర్ల వరకు ఎత్తు కలిగిన మొక్కలను అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్ ల కోసం వినియోగించాలని తెలిపారు. నాటిన ప్రతి మొక్క బతికేలా పక్కాగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నివాస ప్రాంతాల నడుమ ఖాళీ ప్రదేశాలలో నిలువ నీరు ఉండకుండా చూడాలని అన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు మురికి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయాలని, మంచినీటితో కూడిన వనరులలో గంబుషియా చేప పిల్లలు వదలాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని నివాస ప్రాంతాల్లో, వ్యాపార వాణిజ్య సంస్థలలో విధిగా డ్రై డే పాటించేలా చూడాలన్నారు. ఎక్కడైనా మలేరియా, విష జ్వరాలు వంటి పాజిటివ్ కేసులు నమోదు అయితే, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలని, స్థానికుల బ్లడ్ శాంపిల్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించాలని, అవసరమైన వారికి చికిత్సలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన క్రమబద్ధీకరణ అనుమతి మంజూరు చేయాలన్నారు. రెండు పడక గదుల ఇళ్లను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కేటాయించేలా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పోర్టల్ లో లబ్దిదారుల వివరాలు వెంటదివెంట అప్డేట్ చేయాలని అన్నారు.సమీక్ష అనంతరం కలెక్టర్ ఆర్మూర్ పట్టణంలోని 11, 12 వార్డులలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులను వారి నివాసాల వద్దకు వెళ్లి కలిశారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంజూరీ లభించినందున వెంటనే పనులు ప్రారంభించాలని హితవు పలికారు. ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలు ఉంటే, మెప్మా ద్వారా రుణం ఇప్పిస్తామని, ఉచితంగా ఇసుక సరఫరా చేయిస్తామని, ఆయా దశల నిర్మాణాలను బట్టి వెంట వెంటనే రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు ఉన్నారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు ఎమ్మెల్సీ కవిత లేఖ

**- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 02 :

రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం లేఖ రాసింది. తెలంగాణలో బీసీలకు విద్యా, ఉద్యోగాలు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని లేఖలో కవిత విజ్ఞప్తి చేసింది. ఈ డిమాండ్ న్యాయమైనదని తెలంగాణ జాగృతి బలంగా విశ్వసిస్తుందని పేర్కొంది.



Regd No.903/2008

TELANGANA JAGRUTHI

KALVAKUNTLA KAVITHA
President

హైదరాబాద్,
2 జూలై 2025

శ్రీ ఎన్. రామచందర్ రావు గారు,
అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ, తెలంగాణ

విషయము : తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం కోసం తమరి సహకారం గురించి..

తరతరాలుగా సమాజ నిర్మాణంలో నాగరికత వికాసంలో బహుజనుల పాత్ర అత్యంత కీలకమైనది. అదే సమయంలో స్థానిక సంస్థల్లో ఆ వర్గాల ప్రాతినిధ్యం వారి జనాభా ప్రాతిపదికన లేకపోవడం ఆందోళన కలిగించే అంశం. సమాన అవకాశాల కోసం ఓబీసీలు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో సుదీర్ఘకాలంగా ఉద్యమిస్తున్నారు. అందులో తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ న్యాయమైనదని తెలంగాణ జాగృతి బలంగా విశ్వసిస్తోంది.

ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామికంగా తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాము. బీసీ సమాజం ఉద్యమాలకు దిగివచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసన సభ, శాసన మండలిలో రెండు వేర్వేరు బిల్లులు ప్రవేశ పెట్టి ఆమోదించింది రాష్ట్రపతి ఆమోదానికి పంపించింది.

రాష్ట్రపతి ఆమోదానికి బిల్లులు పంపించి చాలా కాలం గడుస్తున్నప్పటికీ ఇంకా ఆమోదముద్ర పడలేదు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత మీపైనే ఉన్నది. రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులకు చట్టరూపం తెచ్చి మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. తద్వారా బీసీ సమాజానికి మీ పార్టీ సానుకూలమని స్పష్టతనివ్వాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు వెంటనే రాష్ట్రపతి ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

కల్వకుంట్ల కవిత,
అధ్యక్షురాలు, తెలంగాణ జాగృతి
ఎమ్మెల్సీ, నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం

040 - 2351 1111 telanganajagruthi@gmail.com
Flat No : 202, 2nd Floor, Hill Top Residency, Road No.14, Banjara Hills, Hyderabad - 500034, Telangana.

# ప్రిన్సిపల్, లెక్చరర్లను కలిసిన శ్రీ రాఘవేంద్ర స్వామీజీ




నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 02 :

బెంగళూరుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీ శ్రీ శ్రీ రాఘవేంద్ర స్వామీజీ బుధవారం రోజు వేల్పూర్ రెవెన్యూ శివారులో గల గోవింద సాయి దివ్య యోగాశ్రమం, షిరిడి సాయిబాబా దేవాలయ అభివృద్ధి కమిటీ క్రియాశీల కార్యవర్గ సభ్యులు ఇరుపాజి దామోదర్ గౌడ్, కూశన్న, నర్సయ్య, అనుసంధాన కర్త కంకణాల రాజేశ్వర్ లతో భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విచ్చేసి ప్రిన్సిపల్ సి.జయపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి విద్యాపరమైన విషయాలను గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు కృష్ణ దాస్, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

**- రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్, సీపీ వెల్లడి**





నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 02

రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశం జరిగింది. పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొని రోడ్డు ప్రమాదాలను నిలువరించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లా మీదుగా ప్రధాన ఎన్ హెచ్ 44, ఎన్ హెచ్ 63 జాతీయ రహదారులు వెళ్తుండడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటికి ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను ఇప్పటికే బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తూ, చేపట్టాల్సిన చర్యలపై ఇదివరకటి సమావేశాల్లో తీసుకున్న అన్ని నిర్ణయాలు అమలు అయ్యేలా.చూడాలన్నారు. ప్రమాదాలకు దారి తీస్తున్న కారణాలను గుర్తించి, వాటికి పరిష్కారం, ప్రత్యామ్నాయాలు అమలు చేస్తే చాలా వరకు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ఈ దిశగా పోలీస్, ఆర్ అండ్ బీ, రోడ్ ట్రాన్స్పోర్ట్ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇప్పటికే కొన్ని బ్లాక్ స్పాట్ల వద్ద చర్యలు చేపట్టిన ఫలితంగా 2023 సంవత్సరం నుండి పోలిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతూ వస్తున్నాయని అన్నారు. అయితే మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని, తద్వారా విలువైన నిండు ప్రాణాలు కాపాడినట్లు అవుతుందని సూచించారు. మూల మలుపులు, కల్వర్టులు, ఎత్తుపల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం వంటి వాటిని సరిచేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా చర్యలు విధిగా పాటించేలా నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పట్టణాల్లోని ముఖ్య కూడళ్లు ,, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రోడ్లను ఆక్రమించుకుని బోర్డులు వంటి వాటిని ఏర్పాటు చేసిన దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని తొలగించాలని, రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. ప్రధాన రహదారులపై ధాన్యం, మొక్కజొన్న వంటి వ్యవసాయ పంటలను ఆరబెడుతుండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. జాతీయ రహదారులు, ప్రధాన మార్గాలలో ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలుపకుండా పర్యవేక్షణ జరపాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్సా ఆంజనేయులు పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న

**వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**




భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి (మన వెలుగు) జూన్ 02 :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా నదులు, వాగులు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉంది. రోడ్లపైకి నీరు చేరే పరిస్థితులు ఏర్పడవచ్చు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, బయటకు రావాల్సి వస్తే అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా అధికారులు మరియు సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు.సెల్ఫీలు తీసుకో వడానికి పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లి ప్రమాదాలకు లోనుకావద్దని ఆయన సూచించారు.విపత్కర పరిస్థితులు తలెత్తినప్పు డు ప్రజలు తక్షణమే జిల్లా కలెక్టరేట్‌లో లేదా ఆర్డీవో కార్యాల యాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లకు, లేదా తమ మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాల యాలకు కాల్ చేసి సమాచారం అందించి సహాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.జిల్లా అధికా రులు, డివిజన్ స్థాయి అధికారులు మరియు అన్ని మండల అధికా రులు అప్రమత్తంగా ఉండి, వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో సంబంధిత రెవెన్యూ, పోలీసు, రోడ్లు, మున్సిపల్ మరియు పంచాయతీ శాఖలతో సమన్వయం చేసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రస్తుతం పడుతున్న వర్షాల సందర్భంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండటాన్ని అలవాటుగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమయంలో వర్షాలకు తీసుకునే ముందు జాగ్రత్తలు, అప్రమత్తత చర్యలు రాబోయే గోదావరి వరదల సమయంలో కూడా ఉపయోగప డతాయని, ఎప్పుడైనా వచ్చే వరదలకు సకాలంలో స్పందించ డానికి అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే విధంగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రమాదాలను నివారించడానికి అధికారులు చేపట్టే చర్యలకు ప్రజలు సహక రించాలని ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజలకు విజ్ఞ ప్తి చేశారు. జిల్లాలో హెల్ప్ లైన్ నెంబర్లు తెలిపారు.08744 -241950 ఏ %IDOC Bhadradri Kothagudem

08743 - 232444 @ Sub Collector, Office, Bhadrachalam

9347910737 for WhatsApp @ Sub Collector, Office, Bhadrachalam

9392919747 for WhatsApp @ @ IDOC Bhadradri Kothagudem

# గోదావరి వరదలు - ముందస్తు చర్యలపై మండల స్థాయి సమీక్షా సమావేశం

**- హాజరైన అన్నీ శాఖల అధికారులు**

**- పునరావాస కేంద్రాల ఏర్పాటు**

**నిర్వాసితుల తరలింపు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన**

**- శానిటేషన్, హెల్త్ క్యాంపులు నిర్వహణ పై కీలక సూచనలు,ఆదేశాలు**






పినపాక (మన వెలుగు) జూన్ 02 :

వర్షాకాలం ప్రారంభమైనందున జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గోదావరి వరదలు మరియు స్థానిక వాగుల వలన ముంపునకు గురి అయ్యే ప్రాంతాలలో శాఖల వారీగా తీసుకోవలసిన ముందస్తు చర్యల పై అశ్వాపురం మండల కేంద్రంలో ఎంపీడీఓ అధ్యక్షతన సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. అన్నీ శాఖల మండల స్థాయి అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ముత్యాలరావు, తహశీల్దార్ మణిధర్ ఎస్సై మధు ప్రసాద్. ప్రభుత్వ వైద్యాధికారి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదావరి, పెద్ద వాగు ముంపు ప్రాంతాలలో, కట్టుదిట్టమైన భద్రత చర్యలను చేపట్టాలని, వరదలు పట్ల అప్రమత్తం గా ఉంటూ ఎప్పటికప్పుడు మండల కేంద్రంలోని కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని, లోతట్టు, ముంపు ప్రాంత నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు, వారికి అవసరమైన భోజన వసతులు సిద్ధం చేసుకోవాలని సమావేశం లో సూచించారు. అలాగే ముంపు ప్రాంతాల్లో హెల్త్ క్యాంపు ల నిర్వాహణ, శానిటేషన్, తాగునీరు విద్యుత్, సౌకర్యాలు కల్పన, ప్రత్యమ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ముంపు ప్రాంతాల బాధ్యులు ఆయా గ్రామాల్లోనే బస చేయాలని, అక్కడి సమస్యలు, ఇబ్బందులపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లకు సమాచారం ఇచ్చేందుకు సిద్ధంగా వుండాలన్నారు. ఉదాసీనంగా వ్యవహరించే బాధ్యులు, అధికారుల పట్ల చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమం లో అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి

**- బిసి సంఘ జిల్లా అధ్యక్షుడు యూత్ దోమకొండ రమేష్**



మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 02 :

ప్రైవేట్ స్కూల్ల పై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి బిసి సంఘ జిల్లా అధ్యక్షుడు యూత్ దోమకొండ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విచ్చలవిడిగా మధ్య దిగువ తరగతి కుటుంబాలని వేధించుకుంటున్నటువంటి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వాళ్ళిష్టా రాజ్యాంగ పుస్తకాలు పెన్నులు సహా ఉన్న దానికి విద్యకు సంబంధించిన వస్తువులు మొత్తం వారే అమ్ముతున్నారని, మధ్యతరగతి బీద కుటుంబాలు నుండి ప్రైవేట్ విద్యా సంస్థలు వారు ఫీజు నిబంధన పట్టికను ఏర్పాటు చేయాకుండా సొమ్ము చేసుకుంటున్నారని బిసి సంఘ జిల్లా అధ్యక్షుడు యూత్ దోమకొండ రమేష్ హెచ్చరించారు.

# తెలంగాణ కిక్ బాక్సింగ్ పోటీలలో మెరిసిన ఇందూరు బిడ్డలు

**- 5 పథకాలు గెలుపు...విజేతలకు పథకాలు అందజేత**

**- డిస్టిక్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పన్నూరి శ్రీనివాస్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 02 :**

తెలంగాణ కిక్ బాక్సింగ్ పోటీలలో ఇందూరు బిడ్డలు తమ సత్తా చాటి ఐదు పథకాలు గెలుపొందారని డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పన్నూరి శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని పసుల కృష్ణారెడ్డి గార్డెన్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయని, ఈ పోటీలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 500 కు పైగా విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.రెండో రోజు బాల, బాలికలకు వేరువేరుగా కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహిం చారని,4 సింథటిక్ కోర్టుల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారని, గెలుపొందిన వారికి తెలంగాణ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎ. పద్మాచారి పథకాలు అందజేశారని తెలిపారు. జిల్లాకు చెందిన పన్నూరి సాయి సిద్ధార్థ పాయింట్ ఫైవ్ -74 కేజీల విభాగంలో ప్రథమ బహుమతి, లావణ్య -70 కేజీల విభాగంలో ప్రథమ బహుమతి,సాయి సిద్ధరెడ్డి -50 కేజీల విభాగంలో ద్వితీయ బహుమతి, కూన కేదార్ం 47 కేజీల విభాగంలో ద్వితీయ బహుమతి,తృతీయ స్థానంలో మరికొన్ని విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథమ, ద్వితీయ, తృతీయ




స్థానాల్లో నిలిచి పథకాలు సాధించారని తెలిపారు. నిజామాబాద్ జిల్లా బిడ్డలు అద్భుతమైన ప్రదర్శన కనబరచడంతో బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ పొన్నూరు శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ శ్రీనివాసులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాల వివరాలు



పాయింట్ ఫైట్- 74కేజీల విభాగంలో పన్నీరు సాయి సిద్ధార్థ ప్రథమ,-70 కేజీల విభాగంలో లావణ్య ప్రథమ,50 కేజీల విభాగంలో సాయి సిద్ధ రెడ్డి ద్వితీయ,-47 కేజీల విభాగంలో కూన కేదార్ ద్వితీయ, 5 తృతీయ స్థానంలో అలాగే మరికొన్ని విభాగాల్లో విద్యార్థులు ప్రతిభచాటి ప్రథమ,ద్వితీయ,తృతీయ, స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు.

# సైన్స్ ను ఇన్వెస్టిగేషన్ టూల్ గా మార్చుకోవాలి

**- పోలీస్ కమిషనర్ సాయి చైతన్**






**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 02 :**

మారుతున్న కాలానికి అనుగుణం గా చట్టాలను, సైన్స్ ను ఇన్వెస్టి గేషన్ టూల్ గా మార్చుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేటులో కార్యాలయంలో జోన్ 2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ 2025 కార్యాక్రమం (నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, అదిలాబాద్ జిల్లాలు) పోలీస్ డిపార్ట్మెంట్ లో పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమను తాము మెరుగుపరుచుకుని ఉత్తమ ప్రతిభ కనబరచడం కోసం తద్వారా కన్వెన్షన్ పెంచడం కోసం ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు. ఇందులో మంచి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయిలో జరిగే డ్యూటీ మీట్ కార్యాక్రమానికి పంపడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యాక్రమంలో నిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్) బస్వారెడ్డి, అదనపు డి.సి.పి (ఎఆర్) రామ్ చందర్ రావ్, సి.సి.ఎస్. ఎ.సి.పి నాగవేంద్ర చారీ, జగిత్యాల్, నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్ సి.ఐలు ఎ,ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్ ని తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్



కామారెడ్డి జిల్లా

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో న్ని కందర్ పల్లి గ్రామంలో గల కేంద్రాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ హాయూమ్ అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు, ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో గల గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల రికార్డులను పరిశీలించారు, లబ్ధిదారులు అందరికీ పౌష్టికాహారం అందించాలని అన్నారు, ఐదు సంవత్సరాల లోపు చిన్నారులను, అంగన్వాడికి వచ్చే విధంగా తల్లిదండ్రులకు అవగాహ కల్పించాలన్ని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తో పాటు మున్సిపాలిటీ సిబ్బంది మహేష్ మరియు కపిల్ పటేల్, అంగన్వాడి టీచర్ విజయలక్ష్మి, చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా, బురద మారిన రాచూరు రోడ్డు పట్టించుకోని ప్రభుత్వ అధికారులు



కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం లోని కందరపల్లి గ్రామం నుండి, రాచుర్ గ్రామానికి మధ్య ప్రమాదకరంగా మారిన రోడ్డు మార్గం స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు గత నెల క్రితం అలా ఉన్న రోడ్డును బాగు చేయిస్తానని భూమి పూజ చేసి వెళ్లారు, పనులను ప్రారంభించి రోడ్డుపై మొరం, మట్టి, వేయడంతో కురిసిన వర్షానికి మధ్యలోనే రోడ్డు పనులు నిలిపివేశారు, దాంతో మరి దారుణంగా రోడ్డు మార్గం తయారయింది, అటుగా వెళ్లే ప్రజలు, రైతులు అవస్థ పడుతున్నారు.

## ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన డీఎంహెచ్ఓ

వికారాబాద్ జిల్లా నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.ఎం. హెచ్.ఓ గా నియమితులైన డాక్టర్ లలితా దేవి పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ని హైదరాబాదులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరోగ్య సేవల పరిస్థితులపై పలు చర్చలు జరిగిన అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి డాక్టర్ లలితా కి శు

# ఘనంగా ఎల్.హెచ్.పి.ఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**● గోవింద్ నాయక్ ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి**

వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని పాల సీతలికరణ కేంద్రంలో లంబాడి హక్కుల పోరాట సమితి 28 సంవత్సరాలు పూర్తి చేసుకొని 29 వ సంవత్సరంలో అడుగు పేటు తున్న సందర్బంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు 1997 జులై 01 నా కామ్రేడ్ మారోజు వీరన్న నాయకత్వంలో లంబాడి హక్కుల పోరాట సమితి ఆవిర్భవించింది

మా తండాలో మా రాజ్యం తండాలను గ్రామ పంచాయితీ లుగా ఎర్పాటు చెయ్యాలని పోరాటం ప్రారంభించింది ఎల్ హెచ్ పి ఎస్ సంఘం మారోజు వీరన్న సలహా సూచనలతో జాతీయ అధ్యక్షులు దాస్ రాం నాయక్ నాయకత్వంలో తండాలను గ్రామ పంచాయితీ లూగా సాధించుకుంది. గత తెరాస ప్రభుత్వం లో 3000 లకు పై చిలుకు తండాలను గ్రామ పంచాయితీలనుసాధించుకున్నాము అని అన్నారు. తండా పంచాయితీ తో పాటు గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కూడా గత కెసిఆర్ ప్రభుత్వం తో పోరాటం చేసి 10 శాతం రిజర్వేషన్ ను సాధించిన ఘనత ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ అధ్యక్షులు దాస్ రాం నాయక్, రాష్ట్ర అధ్యక్షులు గుగులోత్ రాజేష్ నాయక్, రాష్ట్రంలో ఉన్న ఎల్ హెచ్ పి ఎస్ కార్యకర్తలది అని అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఐచ్చిక సెలవు దినంగా సాధించడం జరిగింది.భవిష్యత్తులో తండాలను రెవెన్యూ గ్రామ పంచాయితీ లుగా, సేవాలాల్ మహారాజ్



జయంతిని సాధారణ సెలవు, 10 శాతం రిజర్వేషన్ ను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చే వరకు లంబాడి హక్కుల పోరాట సమితి బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలోని అందించిన హక్కుల ఆధారంగా రాజ్యాంగ బద్ధంగా పోరాటం చేసి హక్కులను సాధించేవరకు పోరాటం కొనసాగుతుంది అని అన్నారు. ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుల ఘనణలో లంబాడి గిరిజనుల జనాభా ను వెంటనే బహిర్గతం చెయ్యాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ సూర్య నాయక్, జిల్లా కార్యదర్శి కేతావత్ రవీందర్ నాయక్,జిల్లా నాయకులు కొర్ర బాలకృష్ణ, తెలంగాణ విద్యావంతలఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఎరన్ పల్లి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం దోమ మండల ఉపాధ్యక్షులు సత్తయ్య, కార్యదర్శి రఘురామ్, దళిత సంఘాల జిల్లా నాయకులు రాములు, బహుజన సేన జిల్లా అధ్యక్షులు వెంకట్, ఎల్ హెచ్ పి ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

**కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇల్లు చూసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి, రాఘవేందర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపి ప్రాణం ఉన్నంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపిన మహిళ**



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు దోమ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ అనంతరం ప్రొసీడింగ్స్ కాపీలను అందజేసిన నాయకులు రాఘవేందర్ రెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ...పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు.ఈ కార్యక్రమంలో బాబ్యా, గోవర్ధన్ ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**కురుమ యువ చైతన్య సమితి రాష్ట అధ్యక్షులు గొరిగె నర్సింహా కురుమ**

**హైదరాబాద్ సిటీ బ్యూరో (మన వెలుగు) జులై 02 :**



తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ 78 వ వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణ లోని ప్రతి గ్రామంలో, మండల కేంద్రం లో, జిల్లా కేంద్రం లో నిర్వహించి నివాళులు అర్పించాలని కురుమ యువ చైతన్య సమితి రాష్ట అధ్యక్షులు గొరిగె నర్సింహా కురుమ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ వీరుడు దొడ్డి కొమరయ్య అని,తెలంగాణ సాయుధ రైతంగ పోరాటంలో భాగంగా కొందరి చేతిలో ఉన్న వేలాది ఎకరాల భూమిని వారి చేతిలో నుంచి విముక్తి కల్పించి పేదలకు పంచిన పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు.ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి రోజు ఘనంగా నివాళులర్పించాలని కోరారు.

# జ్ఞాపకార్థంగా అంగన్వాడి విద్యార్థులకు, వృద్ధులకు వస్తువుల పంపిణీ

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 02 :**



వ ం ప ా బ ా బ ా బ ా ద్ మండలంలోని బలరాం తండా కు చెందిన ఇస్లావత్ బిచ్చు నాయక్ జ్ఞాపకార్థంగా తన కుమారుడు ఇస్లావత్ కోటి నాయక్ మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికా రెడ్డి చేతుల మీదుగా అంగన్వాడి విద్యార్థులకు, ప్లేట్లు, గ్లాసులు, కటోర తో పాటు వృద్ధులకు చేతి కర్రల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై దీపికా రెడ్డి మాట్లాడుతూ... స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో స్ఫూర్తి ధాయకమని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేయాలని సూచించారు, ఈ సందర్భంగా కోటికి ఎస్సై అభినందనలు తెలిపారు. కోటి మాట్లాడుతూ.... గతంలో చాలా సేవ కార్యక్రమాలు నిర్వహించానని, భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందేందుకు ముందు ఉంటానని అన్నారు. కార్యక్రమంలో లాకావత్ వీరన్న, బానోతు వీరన్న, పెద్దపులి వెంకన్న, హరిలాల్, రామచందర్, సురేష్, గణేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## త్రిశక్తి మాత దేవాలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు


**కోరుట్ల (మన వెలుగు) జులై 02 :**



జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో గణేశ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో త్రిశక్తి మాత దేవాలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు నిరహిస్తున్నారు. ఇందులో భాగంగా వారాహి మాత కు మంగళవారం రాత్రి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. వారాహి నవరాత్రులు ఆషాఢ మాసంలో 9 రోజుల పాటు జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ అని ఈ సమయంలో వారాహి దేవిని పూజించడం ద్వారా భక్తులు శత్రువుల నుండి రక్షణ పొందుతారని, కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్ముతారు. ఈ నవరాత్రులు జూన్ 26 నుండి జూలై 4 వరకు జరుపుకుంటారు. వారాహి నవరాత్రుల ప్రత్యేకత ఏంటంటే శత్రువుల నుండి రక్షణ వారాహి దేవిని పూజించడం ద్వారా శత్రువుల నుండి దుష్ట శక్తుల నుండి రక్షణ లభిస్తుందని భక్తులు నమ్ముతారు. వారాహి దేవి అనుగ్రహంతో భక్తుల కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వసిస్తారు. ఆషాఢ మాసంలో వచ్చే ఈ నవరాత్రులు గుప్త నవరాత్రులలో భాగంగా జరుపుకుంటార ని తెలిపారు.గణేశ నవదుర్గ మండలి ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి వారాహి దేవి నవరాత్రులు జరుపుతున్నామని, కానీ ఈ సంవత్సరం నుండి ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహం పెట్టి వారాహి పూజలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. వారాహి మాత నవరాత్రులు జరుపుకోవడం కోరుట్ల పట్టణంలో ఇదే మొదటి మొదటిసారి అని ప్రతిరోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటు న్నారని ఆయన పేర్కొన్నారు.దసరా నవరాత్రులకు, వారాహి నవరాత్రులకు తేడా ఉంటుందని వారాహి నవరాత్రులను గుప్త నవరాత్రులు అంటారని, ఈ మాతకు రాత్రి వేళ పూజిస్తారని, వారాహి మాతకు రాత్రి వేళలో ధూపం, దీపం, నైవేద్యం అభిషేకం హోమం ఉంటాయని, సూర్యాస్త సమయములో పూజ కార్యక్రమాలు జరుపుకుం టారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గణేశ నవదుర్గ మండలి గౌరవ అధ్యక్షులు కట్ట నారాయణ, అధ్యక్షులు కటుకం గణేష్, ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్, కోశాధికారి అడువాల ప్రభాకర్ కార్యవర్గ సభ్యులు గాజుల రమేష్, లక్కంపల్లి విజయ్, నవీన్ కార్యకర్తలు కటుకం గంగారాం, చింతకింది సత్యనారాయణ, కార్తీక్, ప్రవీణ్, రాము, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నెగెటివ్ ప్రచారానికి చెక్

## మంచు విష్ణును ఫాలో అవుతానన్న దిల్ రాజు



నెగెటివ్ ట్రోలింగ్‌ని, ఫేక్ రివ్యూస్‌ని అరికట్టడంలో మంచు విష్ణుని ఫాలో అవుతాం అని ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు.. 'కన్నప్ప' మూవీ విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం చాలా ఉపయోగపడేదని అభినందించాడు. ఇకపై మేము కూడా అదే ఫాలో అవుతామని చెప్పారు. మంచు విష్ణు నటించిన 'కన్నప్ప' జూన్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా రిలీజ్‌కి రెండు రోజుల ముందే మంచు విష్ణు ఓ హెచ్చరికను జారీ చేశారు. 'కన్నప్ప' సినిమాని టా÷-గ్గ÷ట్‌గా చేసుకొని కావాలని ఎవరైన నెగెటివ్‌గా పోస్టులు పెట్టిన, వ్యక్తిగత టార్గెట్ చేసిన.. ఉద్దేశ్యపూర్వకంగా విమర్శలు చేస్తూ పరువుకు భంగం కలిగిస్తే కోర్టు ద్వారా చర్యలు తీసుకుంటాం' అని హెచ్చరిస్తూ పబ్లిక్ కాషన్ నోటీస్‌ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది మంచి ఫలితాన్ని ఇచ్చింది. రిలీజ్ తర్వాత ఫేక్ రివ్యూస్, నెగెటివ్ ట్రోలింగ్ పెద్దగా జరగలేదు. ట్వీటర్‌లో సినిమాపై, మంచు ఫ్యామిలీపై నెగెటివ్ పోస్ట్‌లు పెట్టలేదు. సినిమాకు విమర్శల కంటే ప్రశంసలే ఎక్కువగా వచ్చాయి. అయితే ఈ విషయంలో దిల్ రాజు విష్ణు పద్దతికి ఫిదా అయ్యారు..ఆయన నిర్మించిన తాజా చిత్రం 'తమ్ముడు' జులై 4న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన మీడియాతో ముచ్చటిస్తూ.. నెగెటిట్ ట్రోలింగ్‌పై స్పందించారు.. ' 'కన్నప్ప చిత్రబృందం మంచి నిర్ణయం తీసుకుంది. రిలీజ్‌కు ముందే అలా ఒక హెచ్చరిక జారీచేసింది.. దీంతో ఫేక్ రివ్యూస్, నెగెటివ్ ట్రోలింగ్, పైరసీ తగ్గిపోతుంది. అలా అని రివ్యూస్‌ని ఆపడం మా ఉద్దేశం కాదు. రివ్యూస్ రాయండి. కానీ రాసే ముందు ఒక్కసారి ఆలోచించండి. సినిమాపై కావాలని నెగెటివ్‌గా రాస్తే.. ఎక్కువగా నష్టపోయేది నిర్మాత మాత్రమే. హీరోలు, దర్శకులు ఈ సినిమా కాకపోతే మరో సినిమాతో హిట్ కొడతారు. కానీ నిర్మాత అయితే ఆ సినిమాకు డబ్బులు పోగొట్టుకోవాల్సిందే కదా? అది దృష్టిలో పెట్టుకొని జన్యూన్‌గా రివ్యూస్ ఇవ్వండి. దయచేసి హెల్ప్ చేయకపోయినా పర్లేదు ..డ్యామేజ్ మాత్రం చేయద్దు' అని దిల్ రాజు విజ్ఞప్తి చేశాడు.



## వార్-2ను తెలుగులో రిలీజ్ చేయనున్న నాగవంశీ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ యాక్షన్ మూవీ వార్ 2. బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నాడుఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. ఎన్టీఆర్, హృతిక్ మధ్య వచ్చే యాక్షన్ ఎపిసోడ్స్ ఫ్యాన్స్ కు విజువల్ ఫీస్ట్ ఇస్తాయని యూనిట్ కూడా బలంగా నమ్ముతోంది. యష్ రాజ్ ఫిల్మ్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సినిమా తెలుగు రైట్స్ ను సితార ఎంటె÷-టంల్గ÷నమెంట్స్ నాగవంశి సుమారు రూ. 90 కోట్లకు కొనుగులు చేసారు. తెలుగు సినిమా చరిత్రలో ఒక నాన్ తెలుగు సినిమాకు ఈ ధర పలకడం హిస్టరీ. కేవలం ఎన్టీఆర్ నటిస్తుండడంతోనే ఆ రేట్ పలికిందనేది వాస్తవం. అనుగుణంగానే వార్ 2 తెలుగు స్టేట్స్ రిలీజ్ ను అదే స్థాయిలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడు నాగవంశీ. ఆగస్టు 14న తెల్లవారు జామున షోస్ వేసేలా ఎ÷-లాన్ చేస్తున్నాడట. ఇప్పటికే అందుకు అందుకోసం థియేటర్స్ తో చర్చలు కూడా చేస్తున్నారట. భారీ యాక్షన్ ఎంటె÷-టంల్గ÷నర్ గా వస్తున్న వార్ 2 ను తెలుగు రాష్టాల్లో మొదటి రోజు బి÷-గగెస్ట్ నంబర్స్ ఉండబోతున్నాయి. అలాగే తమిళ సుపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనకరాజ్ కాంబోలో వస్తున్న పాన్ ఇండియా బి÷-గగెస్ట్ మల్టీస్టారర్ కూలీతో పోటీగా రిలీజ్ అవుతుంది వార్

## విశ్వంభర గ్రాఫిక్స్ హాలివుడ్‌కు అప్పగింత



తెలుగు ఫిల్మ్ ఇండస్టీ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీలలో 'విశ్వంభర' ఒకటి. అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా.. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనుల్లో బిజీగా గడుపుతుంది. సినిమా టీజర్‌పై విపరీతంగా ట్రోల్స్ రావడంతో గ్రాఫిక్స్‌పై మరింత కష్టపడుతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా గ్రాఫిక్స్‌కి సంబంధించి తాజాగా ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమా గ్రాఫిక్స్ పనులను హాలీవుడ్‌కి చెందిన వీఎఫ్ఎక్స్ స్టూడియోకి అప్పగించినట్లు తెలుస్తుంది. ఈ హాలీవుడ్ స్టూడియో విశ్వంభర సినిమాకు సాలిడ్ అవుట్ పుట్‌ని అందించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ పనులు కంప్లీట్ అయిన అనంతరం సినిమా విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నట్లు సమాచారం. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరు ఒక సినిమా చేస్తున్నాడు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు.

## రామాయణం ఫస్ట్ పార్ట్ షూట్ పూర్తి

### నేడు గ్లింప్స్ విడుదల అంటూ ప్రచారం



బాలీవుడ్‌లోని ప్రముఖ దర్శకుల్లో ఒకరైన నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతోన్న పాన్-ఇండియా మైథలాజికల్ మూవీ 'రామాయణ' .తొలి భాగం షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానుల్లో భారీ అంచనాలు పెంచుతుంది. ఇందులో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా కనిపించనుండగా, కన్నడ రాక్‌స్టార్ యష్ రావణుడి పాత్రలో నటిస్తున్నారు. అలాగే కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో నటించనుందన్న వార్తలు వెలువడుతున్నాయి. తాజాగా షూటింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా సినిమా యూనిట్ కేక్ కట్ చేస్తూ జరుపుకున్న సంబరాలు సోషల్ మీడియాను హీటెక్కిస్తున్నాయి. ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. తొలి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయాలని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. షూటింగ్ పూర్తయినందున, సినిమాకు సంబంధించిన గ్లింప్స్ వీడియోను జూలై 3న విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ ఈవెంట్‌కు టీమ్ మొత్తం హాజరుకానున్నారు. బెంగళూర్‌లో జరగనున్న ఈ కార్యక్రమం కోసం తారలంతా అక్కడికి బయల్దేరుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చిత్రంలో లక్ష్మణుడిగా రవి దూబే కనిపించనుండగా, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, హనుమాన్‌గా సన్నీ డియోల్, దశరథుడిగా అరుణ్ గోవిల్ కనిపించి అలరించనున్నారు. ఇక యష్ ఈ చిత్రంలో నటించడమే కాకుండా, సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషలతో పాటు పలు ఇతర భారతీయ భాషల్లో విడుదల కానుంది. భారీ స్థాయిలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని అప్‌డేట్స్ త్వరలో వెల్లడించనున్నట్టు చిత్ర బృందం తెలిపింది. రామాయణం రూపంలో భారతీయ సినీ చరిత్రలో మరో విజువల్ వండర్ రాబోతుందన్న ఊహలు జోరుగా వినిపిస్తున్నాయి.

## నటనను వదిలేశానంటూ రూమర్లు

### అలాంటిదేమీ లేదన్న నటి కోమలి ప్రసాద్

లుగు చిత్రసీమలో తనదైన ముద్ర వేసుకుని నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది కోమలి ప్రసాద్. ఇటివల నాని 'హిట్ 3' మూవీలో ముఖ్యపాత్ర పోషించిన ఈ ముద్దుగుమ్మ, త్వరలో 'శశివదనే' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఆమె గురించి కొన్ని అబద్దపు పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. నటనకు గుడ్ బై చెబుతూ డాక్టర్ వృత్తిలోకి మారిపోయింది అని పుకార్లు వినిపించడంతో, కోమలి తానే స్వయంగా స్పందించారు.. 'అందరికీ నమస్కారం. ఇటీవల నా గురించి డాక్టర్‌గా మారిపోయానని, నటనను పూర్తిగా వదిలేశానని కొన్ని అసత్య వార్తలు ప్రచారంలో ఉన్నాయి. కొందరు ప్రముఖ మీడియా సంస్థలు కూడా దీనిని నిజమైందన్నట్లుగా ప్రచారం చేయడం బాధాకరం. ఇది పూర్తిగా అసత్యం. నిజానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ సినిమాల్లో నా స్థానం సంపాదించుకున్నాను. ఆ శివుని ఆశీస్సులతో నా నటనా ప్రస్థానం కొనసాగుతోంది. ఈ రకమైన రూమర్లు నాలోను, నా శ్రేయోభిలాషుల్లోను అనవసరంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకూడదని మనస్ఫూర్తి వేడుకుంటున్నాను. అందుకే ఈ పోస్ట్ ద్వారా నిజాన్ని మీ అందరితో పంచుకోవాలనుకున్నాను. నటన నాకు ఒక్క ఉద్యోగం మాత్రమే కాదు.. అది నా జీవన విధానం. చివరి శ్వాస వరకు నేను నటనతోనే జీవించాలనుకుంటున్నాను. ప్రస్తుతం కొత్త స్క్రిప్ట్‌లను ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాను. త్వరలోనే మీ అందరినీ గర్వపడేలా చేసే కొత్త ప్రాజెక్ట్‌ల వివరాలతో మీ ముందుకు వస్తాను. నా ప్రయాణంలో వెన్నెముకలా నిలిచిన నా శ్రేయోభిలాషులకు, నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని కోమలి ప్రసాద్ తేల్చిచెప్పింది.

